

లీగల్ ఎయిడ్ క్లినిక్స్ పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి - కడప

లీగల్ ఎయిడ్ క్లినిక్ పురోగతిపై శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవన్‌లో సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధివిధానాలు, పారా లీగల్ వాలంటీర్ల విధివిధానాలు, పానెల్ న్యాయవాదుల విధివిధానాలు, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరించారు. నల్సా పథకముల మొదలగు వాటిని వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి హరిబాబు, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

మాధవరంలో విషాదం

- ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య
- రైలు కింద పడి భర్త..ఉరేసుకుని భార్య, కుమార్తె..
- ఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభ్యం
- రెవెన్యూ అధికారులు మోసం చేశారని బలవన్మరణం

రెవెన్యూ అధికారుల ధనదాహానికి ఓ నిండు కుటుంబం బలి అయింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వేర్వేరు ప్రాంతాల్లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈఘటన ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. సంఘటనతో గ్రామమంతా ఉలిక్కిపడింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..



ఉరేసుకుని మృతి చెందిన పద్మావతి, వినయ, రైల్వే ట్రాక్‌పై సుబ్బారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

కొత్తమాధవరానికి చెందిన పాలసుబ్బారావు (47) చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఒంటిమిట్ట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 2185/2లో మూడెకరాల భూమి ఉంది. ఆ భూమిని అమ్ముకునేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో రికార్డులు తారుమారు చేశారు. కబ్జా శ్రావణి అనేపేరుపై ఆన్‌లైన్‌లో ఎక్కించడంతో మనస్తాపం చెందిన సుబ్బారావు, అతని భార్య పద్మావతి(41), కుమార్తె వినయ (17) ఆత్మహత్యకు పాల్పడ్డారు. శనివారం ఉదయం తల్లీకూతుళ్లు ఇంట్లోనే ఉరేసుకుని మృతి చెందారు. పాల మనిషి వచ్చి తలుపు తట్టగా ఎవరూ తీయకపోవడంతో అతను స్థానికులకు తెలియజేశాడు. వారు తలుపు తీసి చూడగా తల్లీకూతుళ్లు విగత జీవులుగా పడి ఉండడం చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సుబ్బారావు మాత్రం ఒంటిమిట్ట చెరువు దగ్గర ఉన్న రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న సిఐ పురుషోత్తమరాజు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ట్రాక్‌పై సూసైడ్ నోట్ లభించింది. కడప డిఎస్‌పి షరీఫ్ కొత్త మాధవరంలోని మృతుల ఇంటిని పరిశీలించారు. ఆత్మహత్యలపై స్థానికులతో ఆరా తీశారు. మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.



పాల సుబ్బారావు, పద్మావతి (ఫైల్‌ఫోటో)

ఆన్‌లైన్‌లో భూ కబ్జా..

పాల సుబ్బారావు చేనేత కార్మికుడిగా మగ్గం పనులు చేసుకుంటూ భార్య, ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటున్నాడు. ఒక కుమార్తె హైదరాబాద్‌లో చదువుకుంటుంది. అతనికి మూడెకరాల భూమి ఉంది. 2015లో తన పేరుపై ఆన్‌లైన్ చేశాడు. రైతు భరోసా కింద డబ్బులు పడుతూ ఉండేవి. రెండేళ్ల కిందట ఇంటి అవసరాల కోసం తన తన పేరుమీదగాక కట్టా శ్రావణిపై ఉంది. ఈ విషయంపై అతను రోజూ రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగేవాడు. ఎలాంటి ప్రయోజనం లేకపోవడం, పేద కుటుంబం కావడంతో ఇద్దరి కుమార్తెలను ఎలా పోషించుకోవాలో అర్థం కాక ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని స్థానికులు పేర్కొం టున్నారు. రెవెన్యూ అధికారుల మోసానికి నిండు కుటుంబం బలైందని వాపోతున్నారు.



సూసైడ్ నోట్ చూపుతున్న డిఎస్‌పి

సూసైడ్ నోట్‌లో..

మూడెకరాల పొలాన్ని అమ్ముకోవాలని అనుకోగా రెవెన్యూ అధికారులు తమ పొలాన్ని వేరే వారి పేర్లపై మార్చి మోసం చేశారని, ఏమీ చేయలేని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడినట్లు సూసైడ్ నోట్‌లో రాసింది ఉంది.

డాగ్ స్క్వాడ్ పరిశీలన..

డిఎస్‌పి ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ మృతుల ఇంటి చుట్టూ పరిశీలించారు. జాగిలం ఇంటి వెనుకభాగం వరకు వెళ్లి ఆగింది. తరువాత తిరిగి ఇంటి వద్దకు వచ్చింది. దీనిపై పోలీసులు సమాచారం ఇవ్వాల్సి ఉంది.

డిఎస్‌పి ఏమన్నారంటే..

రెవెన్యూ అధికారులు పాలసుబ్బారావు భూమిని ఆన్‌లైన్‌లో తారుమారు చేయడంతో మృతి చెందినట్లు సూసైడ్ నోట్‌లో రాసి ఉంది. సూసైడ్ ఆధారంగా విచారణ కొనసాగిస్తుమని కడప డిఎస్‌పి షరీఫ్ పేర్కొన్నారు.



మృతుల ఇంటి వద్ద డాగ్‌స్క్వాడ్ పరిశీలన

అధికారుల ఆగడాలకు హద్దే లేదు..

రెవెన్యూ అధికారుల ఆగడాలకు అంతే లేకుండా పోయింది. వారి అండదండలతో కబ్జాదారులు భూములను ఆక్రమిస్తున్నారు. వారి ధనదాహానికి ఓ నిండు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. ఆన్‌లైన్‌లో అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి.

-పన్నెల చంద్ర శేఖర్, గ్రామ సర్పంచ్.

కఠినంగా శిక్షించాలి

రెవెన్యూ అధికారుల మోసం వల్ల నా కుమార్తె, అల్లుడు, మనమరాలు ఆత్మహత్య చేసుకున్నారు. వారి మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి. నా ఇంకో మనమరాలిని ప్రభుత్వం ఆదుకోవాలి.

- వెంకటసుబ్బమ్మ, మృతురాలి పాలపద్మ తల్లి.

ప్రజ ప్రాణాలకు రక్షణ కరువు : 'చమర్తి'

రాజంపేట అర్బన్ : వైసిపి పాలనలో ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేదని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. వైసిపి నాయకులు ప్రకృతి సహజ సంపదైన భూమి, ఇసుక దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైసిపి నాయకుల దౌర్జన్యాలకు, భూదాహానికి రాష్ట్రంలో ఎందరో రైతులు, సామాన్య ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.

తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి : కాంగ్రెస్

తమ భూమిని ఇతరుల పేర్లతో ఆన్‌లైన్ చేయడంపై మనస్తాపం చెంది మృతిచెందిన చేనేత కుటుంబానికి న్యాయం చేయాలని పిసిసి అధికార ప్రతినిధి పూల భాస్కర్ డిమాండ్ చేశారు. లంచం తీసుకొని దొంగ ఆన్‌లైన్ సృష్టించిన తహశీల్దారుపై చర్యలు తీసుకోవాలన్నారు. వైసిపి ప్రభుత్వంలో సామాన్య ప్రజలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందన్నారు.

నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించామనితాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు చేపట్టామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. శనివారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్ఆర్ఇజిఎఎస్ - కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, వేసవిలో తాగునీటి అవసరాల సన్నద్ధత మొదలైన అంశాలపై. అన్ని జిల్లాల కలెక్టర్ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమావేశానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు, జెసి గణేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనుల లేబర్ కాంపోనెంట్ పెంపుతో పాటు, కూలీలకు కొరత లేకుండా తాగునీటి సదుపాయం కల్పిం చాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయడం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అధిక నీటి ఎద్దడి పరిస్థితులు లేకపోయినప్పటికీ ఏప్రిల్ నాటికి అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి వాసరాలకు సరిపడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రత్యేకించి కడప పట్టణ నీటి అవసరాలను తీర్చే పెన్నానదిలో సరిపడా నీరు లేకపోవడంతో మైలవరం కుడి కాలువ నుంచి ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట ద్వారా నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. దీంతో పట్టణ తాగునీటి అవసరాలతో పాటు రూరల్ ప్రాంతాల్లో కొంతమేర సాగునీటి అవసరాలు కూడా తీరుతాయని తెలిపారు.



విసిలో పాల్గొన్న కలెక్టర్, జెసి

లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



విప్లవ వీరులకు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మతోన్మాదులు నుంచి భారత దేశాన్ని, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకుందామని విద్యార్థి, యువజన, రైతు, కార్మిక ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. శనివారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా కడప పాత బస్టాండ్ జిల్లా కార్యాలయంలో మృతవీరులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాలశివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గండి సునీల్ కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసుల రెడ్డి, ైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ 1907వ సంవత్సరం లయల్పూర్ జిల్లాలో భంగా గ్రామంలో జన్మించిన భగత్ సింగ్ చిన్నప్పటినుంచే గద్దర్ వీరులు, స్వాతంత్ర పోరాట యోధుల ఉద్యమాలకు ఆకర్షితులై చదువుకునే రోజుల నుంచే స్వతంత్ర పోరాటంలో పాలుపంచుకున్నారని తెలిపారు. ముఖ్యంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుంచి భారతదేశాన్ని విముక్తి చేయడానికి విద్యార్థుల్ని యువకుల్ని పెద్ద ఎత్తున ఉద్యమాల్లోకి తీసుకురావడంలో కీలక పాత్ర వహించారని తెలిపారు. వారి స్వార్థం కోసం కాకుండా ఈ దేశం కోసం అతి చిన్న వయసులోనే నవ్వుతూ ఉరి కంభం ఎక్కిన విప్లవ వీరులు అని కొనియాడారు. అప్పట్లో భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వం మతం మధ్య చిచ్చు పెట్టి పబ్బం కడుపుకోవాలని చూస్తే భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్, అల్లూరి చంద్రశేఖర్ ఆజాద్ లాంటి వాళ్లు కుల మతాలకతీతంగా భారతీయులందరినీ ఏకం చేసి పోరాటాల్లోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. 1931 మార్చ్ 23న నవ్వుతూ వురి కంభం ఎక్కిన భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవుల స్ఫూర్తితో తండోపతండాలుగా యువకులు స్వతంత్ర పోరాటంలో పాల్గొనడం వల్లే స్వతంత్రం సిద్ధించిందని చెప్పారు. ప్రస్తుతం సామ్రాజ వాద శక్తులు భారతదేశంలో చొరబడి ప్రజల సొమ్మును లూటీ చేస్తున్నాయని అన్నారు. ప్రజలను మతం మత్తులో నింపి బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. నేడు దేశంలో నిరుద్యోగాన్ని పేదరికాన్ని పెంచారన్నారు. ప్రజలు తిరుగుబాటు చేయకుండా యువతి, యువకులందరినీ కూడా మతం మత్తులో ముంచేత్తుతున్నారని ఆరోపించారు. దేశ సంపదనంతా బడా కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారని తెలిపారు. దేశంలో ఎన్నడూ లేనంత నిరుద్యోగాన్ని పేదరికాన్ని పెంచి పోషించారని ఆరోపించారు. ప్రజల పైన ధరల భారం, అనేక నిర్బంధాలు పెరిగిపోయి ప్రజలు ఆర్థికంగా చితికిపోయారని తెలిపారు. కాబట్టి భారతదేశం నుంచి మతోన్మాదులను తరిమి కొట్టాలని లౌకిక ప్రజాస్వామ్య వామపక్ష శక్తులను కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విభజన హామీలైన కడప ఉక్కు సాధన కోసం విద్యార్థులు, యువత, కార్మిక, కర్షక,రైతులు ప్రజలు అందరూ పోరాటాలలో భాగస్వామ్యం కావాలన్నారు. హామీలు నెరవేర్చని బిజెపిని ఎండగడదమని పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసిపి, టిడిపి, జనసేనలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, సుబ్బయ్య, డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు షేక్.షాకీర్, నగర ఉపాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

'బండ్ల' సాహిత్య సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగు సాహిత్యానికి బండ్ల వెంకటరమణయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ప్రముఖ కవి పండితులు విద్వత్కవి తిలక బండ్ల వెంకటరమణయ్య శత జయంతి సభను శనివారం రాజరాజేశ్వరి మందిరంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జి. రామమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అతి నిరాడంబర జీవితం గడిపిన బండ్ల వెంకటరమణయ్య అపర మేధావని పేర్కొన్నారు. అటు తెలుగు సాహిత్యంతో పాటు ఆంగ్ల, గణిత శాస్త్రంలో నిష్ణాతుడని చెప్పారు. బండ్ల వెంకటరమణయ్య రచించిన మంజీర విలాసం, మధురా విజయం లాంటి మహాకావ్యాలు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో ధార్మిక ఉపన్యాసకులు కె.వి.నారాయణ రెడ్డి, కె.సుబ్బారెడ్డి, బి.వి. సుబ్బారెడ్డి, కె. రాజారెడ్డి, ఎన్.శ్రీనివాసులు, ఏ.ముకుందారెడ్డి, ఎన్. సుబ్బరామచంద్రయ్య, జి.రామకృష్ణలను సన్మానించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

- సిడిపిఒ రమాదేవి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సిడిపిఒ రమాదేవి పేర్కొన్నారు. శనివారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకుల ఆదేశాల మేరకు శనివారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా సికె దిన్నె, చిన్న ముసలిరెడ్డిపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని చెప్పారు. వీటిని ప్రోత్సహించినా, లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నా శిక్షార్హులు అవుతారని తెలియజేశారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని తెలియజేశారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం లీగల్ ఆఫీసర్ సునీత రాజు మాట్లాడుతూ పిల్లల రక్షణ కోసం ఉన్నటువంటి చట్టాలు, 1098 హెల్ప్ లైన్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధి లోని సూపర్‌వైజర్లు శ్రీదేవి, వెంకట లక్ష్మి, బాలల పరిరక్షణ విభాగం ఔట్ రీచ్ వర్కర్ ప్రసన్న లక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.



తులసిరెడ్డిని కలిసిన వివేకా కుమార్తె, అల్లుడు

తులసిరెడ్డితో వివేకా కుమార్తె, అల్లుడు భేటీ

ప్రజాశక్తి - వేంపల్లె

పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డిని శనివారం మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె వైఎస్ డాక్టర్ సునీతమ్మ, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. కడప నుండి పులివెందులకు వెళుతూ వారు తులసిరెడ్డి ఇంటికెళ్లారు. మర్యాదపూర్వకంగానే సునీతమ్మ, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి కలిశారు. వీరిని తులసిరెడ్డి సన్మానించారు. దాదాపు గంటసేపు తులసిరెడ్డితో ఏకాంతంగా రాజకీయ విషయాలపై చర్చించారు. వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి కూడా చర్చించినట్లు సమాచారం. ఎన్నికల ప్రచార సమయంలో వివేకానందరెడ్డి హత్య జరిగిన తీరుపై ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలనే దానిపై చర్చించినట్లు తెలిసింది. వివేకా కుమార్తె కాంగ్రెస్ పార్టీ వైపే ఉండేలా చర్చించినట్లు సమాచారం. పులివెందుల అసెంబ్లీ స్థానానికి పోటీ చేసే విషయం చర్చినట్లు తెలిసింది. అనంతరం డాక్టర్ సునీతమ్మకు కాంగ్రెస్ నాయకులను తులసిరెడ్డి పరిచయం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్‌రెడ్డి, రాజా, బాలం సుబ్బరాయుడు, మాస్, అమర్, వెంకటేష్, ఉత్తన్న పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కడప : ప్రతి ఒక్కరికీ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన ఉండాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ సూచించారు. శనివారం లోక్ అదాలత్ న్యాయ సేవలపై శారద పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ సైన్సెస్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వినియోగిత సేవలపై ఆయా శాఖలకు వచ్చిన కేసులను వెంటనే క్లియర్ చేయాలని అన్నారు. ఆయా శాఖ వారీగా కేసులపై సమీక్షించారు. ప్రతి ఒక్కరికీ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన ఉండాలని చెప్పారు. పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా ఫిర్యాదుదారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని పర్మనెంట్ లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

వైసిపి గూండాల దాడి గర్హనీయం

కడప అర్బన్ : గన్నవరంలో టిడిపి కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవి రెడ్డిపై వైసిపి గూండాల దాడి టిడిపి గర్హనీయమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ అన్నారు. శనివారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిలో జగన్ సిఎం అయ్యాక గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని విమర్శించారు. వైజాగ్‌లో గిరిజనులతో వైసిపి నాయకులు గంజాయి పంటలు పండిస్తున్నారని తెలిపారు. పోరుమామిళ్లలో మట్టి మాఫియా పెట్రేగి పోతుందని చెప్పారు. మాధవరంలో వైసిపి నాయకుల అండదండలతో సామాన్య కుటుంబానికి సంబంధించిన భూమిని కబ్జా చేశారని పేర్కొన్నారు. దీంతో ఆ కుటుంబం అంతా ఆత్మహత్య పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయసాయి రెడ్డి కనుసన్నల్లో గంజాయి మాఫియా పనిచేస్తుందని తెలిపారు. అభం శుభం తెలియని గిరిజనులు వైసిపి నాయకుల కుట్ర వల్ల జైలు పాలు అవుతున్నారని

పరీక్షా కాలం

ప్రజా'దృష్టి'

జిల్లాలో పరీక్షల సీజన్ నడుస్తోంది. ఒకవైపు టెన్త్, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సీజన్, మరోవైపు సార్వత్రిక రాజకీయాన్ని పరీక్షకు నిలవనుంది. ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత చదువులతో ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు ప్రయత్నాలు చేయడం పరిపాటి. ఇదేతరహాలో రాజకీయ నాయకులు శాసన అధికారాల్ని, పదవులను సాధించుకునే ప్రయత్నాలను ముమ్మరం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. కడప, అన్నమయ్య జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్ నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వీటిని కైవసం చేసుకునే పనుల్లో ఆయా రాజకీయ పార్టీల తరుపున పలువురు అభ్యర్థులు నిమగ్నమయ్యారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల కోడ్‌ను వర్తింపజేసింది. రాబోయే మూడు నెలల్లో ఎటువంటి అభివృద్ధి కార్యకలాపాలు మొదలుకుని ఎటువంటి రాజకీయ పక్షపాతాలకు అవకాశం లేకుండా పోయింది. ఎన్నికల కోడ్ ప్రకటన దగ్గర నుంచి జూన్ మొదటి వారం వరకు రాజకీయ యజ్ఞం నడవనుంది. జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేసింది. రాజకీయ యజ్ఞంలో ఆయా పార్టీల అభ్యర్థులు నిజాయతీగా గెలిచి శాసన క్రతువులో నిలవాలి. కానీ పలువురు అభ్యర్థులు వ్యూహప్రతివ్యూహాలతో ఒకరిపై ఒకరు పైచేయి సాధించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తుండడం పరిపాటిగా మారింది. ఇటువంటి అనైతిక కార్యకలా పాలతో గెలిచిన గెలుపు గెలుపే కాదని గ్రహించాలి. మందు, మత్తు, మనీ పంపిణీ వంటి అనైతిక పద్ధతుల ద్వారా గెలవడం ఓట మితో సమానమని గ్రహించాలి. ఇటువంటి ప్రజాస్వామ్య గాంధేయ పద్ధతులతో ఎన్నికల్లో గెలిచిన వారే నిజమైన విజేతలు. ఇటువంటి విజేతలకు పదవీయోగం పట్టాలి. అందలమూదక్కాలి. కానీ సార్వత్రిక ఎన్నికల చివరి క్రతువు నాటికి ప్రజాస్వామ్యం అపహాస్యం పాలు కావడం పరిపాటిగా మారింది. ఎన్నికల్లో ఓడిన వారికీ పార్టీల తరుపున ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులుగా ఆధిపత్యం వహించడం పరిపాటిగా మారింది. ఒకవేళ తాము ప్రాతినిథ్యం వహిస్తున్న పార్టీకి అధికారం దక్కి ఓటమి పాలైన ఇన్‌ఛార్జులే విజేతల తరహాలో రాజభోగం అనుభ వించడం తెలిసిందే. గెలిచిన అభ్యర్థుల పార్టీ ఓడినా ఎటువంటి ప్రాధాన్యత ఉండదు. ఒకవేళ సంకీర్ణం ఏర్పడినా, స్వల్ప మెజార్టీతో అధికారం చేపట్టినా రాజకీయం రసవత్తరంగా మారనుంది. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికైనా ఎన్నికల క్రతువులో నిలిచిన అభ్యర్థులు ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలపాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

నైపుణ్యాలను ఒడిసిపడితేనే అవకాశాలు

వైవీయూ వ్యవస్థాపక కళాశాల ఉత్సవంలో న్యూఢిల్లీ ఎస్.ఆర్.ఎఫ్ ఫౌండేషన్ డైరెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థి దశలో సమాజ అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలను, లోతైన జ్ఞానాన్ని , నైపుణ్యాలను ఒడిసి పడితే ఈ ప్రపంచమే మీది అవుతుందని న్యూఢిల్లీ ఎస్.ఆర్.ఎఫ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ వై. సురేష్ రెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం 18వ వ్యవస్థాపక దినోత్సవం, కళాశాల ఉత్సవం శనివారం క్యాంపస్ లోని డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం సెంట్రల్ లైబ్రరీ భవన ప్రాంగణంలో విసి ఆచార్య చింత సుధాకర్ అధ్యక్షతన ప్రారంభమైంది. ముఖ్య అతిధి గా హాజరైన డాక్టర్ వై. సురేష్ రెడ్డి ప్రసంగిస్తూ నిన్నటి కంటే నేడు, నేటి కంటే రేపు మన ప్రగతి అభివృద్ధి దిశగా వెళుతుంటే మనకు ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయాల నుంచి కేవలం సర్టిఫికెట్ తీసుకొని సమాజంలోకి వెళితే ఎలాంటి ప్రయోజనం లభించదన్నారు. వాటితో పాటు సబ్జెక్టులో లోతైన విషయ అవగాహన, నైపుణ్యతలను తీసుకు వెళ్లినపుడు అవకాశాలు మీ ముంగిట వాలుతాయని చెప్పారు. ఏ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చామన్నది ముఖ్యం కాదని మనకున్న వనరులను ఎలా సద్విని యోగం చేసుకున్నామన్నది ముఖ్యమన్నారు.విసి మాట్లాడుతూ చంద్రయన్-3 విజయాన్ని అందరం చూశామని, సంతోషించామని దాని వెనుకబడిన ఇస్రో చైర్మన్ ఎస్సీ సోమనాథ్ అనారోగ్య సమస్యలను అధిగమించి ముందుకెళ్లడం ఉదాహరణలతో వివరించారు. యువత కష్టాలు ఉన్నాయని ఆగిపోతే ప్రగతి ఉండదన్నారు. కోర్స్ పూర్తి చేసుకుని వెళుతున్న విద్యార్థుల విజయాలు మీ తర్వాతి తరానికి పాఠాలు కావాలన్నారు. తిరుపతి ఎస్వీయూనివర్శిటీ విసి ప్రొఫెసర్ వి. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 20-20 మొట్టమొదట అమలులోకి తెచ్చిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌గా గుర్తు చేశారు. 18 ఏళ్లలోనే వందేళ్ల కిందట ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయాలతో పోటీపడుతూ అద్వితీయమైన ప్రగతిని సాధిస్తున్న వైవీయూ పేరెంట్ యూనివర్సిటీ ఎస్ వీ యూ విసిగా తాను గర్విస్తున్నానన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ రెడ్డి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వై. పి. వెంకటసుబ్బయ్య, ఆచార్యపుత్తా పద్మ, హ్యూమానిటీస్ డీన్ ఆచార్య రామ ప్రసాద్ రెడ్డి, విద్యాలయ పాలక పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, ఆ చార్య చంద్రమతి శంకర్, డాక్టర్ మాదక్క, శ్రీలత, ముబీనా బేగం, వై వి యు వివిధ విభాగాల డైరెక్టర్లు ఆచార్య రమాదేవి,, రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న, వై వీ యూ పూర్వపు ప్రిన్సిపల్ ఆచార్యులు సాంబ శివారెడ్డి, మాజీ రిజిస్ట్రార్ గులాబ్ తారిక్, టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్, అకడమిక్ కన్సల్టెంట్స్, రీసెర్చ్ స్కాలర్స్ , విద్యార్థులు పాల్గొన్నారు.

'మేము సిద్ధం' విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -గోపవరం

ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్వహించే మేము సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బయనపల్లి యువజన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 27న ఉదయం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయలో వైయస్సార్‌కు నివాళులర్పించి, ఈ యాత్రను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం ప్రొద్దుటూరులో భారీ బహిరంగ సభ ఉంటుందని యువత కదిలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ గంగిరెడ్డి, జిల్లా యూత్ వింగ్ సెక్రటరీ ప్రణీత్, వైసిపి మున్సిపల్ యూత్ ప్రెసిడెంట్ పి శ్రీకాంత్ రెడ్డి, యూత్ మెంబర్ జి కృష్ణరెడ్డి, ఉప సర్పంచ్ నాగిరెడ్డి రవికుమార్ రెడ్డి, ఎ. రాంప్రసాద్ రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

టిడిపి వర్క్‌షాప్‌లో అభ్యర్థులు

కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో లోక్ సభ, శాసనసభ అభ్యర్థులకు విజయవాడలో ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించారు. జిల్లా నుంచి నాయకులు వర్క్ షాప్ హాజరయ్యారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాస రెడ్డి, కడప నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్. మాధవి పాల్గొన్నారు. ఏ1 కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన కార్యక్రమానికి పార్టీ అధినేత చంద్రబాబు హాజరై దిశానిర్దేశం చేశారు.

నేడు నెలనెలా సీమ సాహిత్యం

కడప అర్బన్ : వైవీయూ ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 130వ సదస్సును ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి. రామప్రసాద రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప : విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 24, 25న సెలవు రోజులైనప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారి ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు విద్యుత్ వినియోగదారులు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కాశినాయన : మండల కేంద్రమైన నర్సాపురంలోని ఎపి మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ సౌజన్య తెలిపారు మోడల్ పాఠశాలలో చేరాలనుకునే విద్యార్థులు ఈనెల 28 నుంచి మే 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పాఠశాలలో బైపిసి, ఎంపిసి, ఎంఇసి, సిఇసి కోర్సుల్లో చేరవచ్చన్నారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఉంటుందన్నారు. పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్ ఆదివారం (సా)	షహారీ సోమవారం (ఉ)
6.30	5.01


అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ అధికారులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - ఖాజీపేట

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం, అనర్థదాయకమని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి శ్రీదేవి అన్నారు. శనివారం ఖాజీపేట-1 అంగన్వాడీ కేంద్రంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రాజెక్ట్ అధికారిణి, బాల సంక్షేమ అధికారిణి విజయ కుమారి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, బాలికల విద్య ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు భారతి, శ్రీదేవి, జహీరాబీ, రమాదేవి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : భవిష్యత్ తరాల కోసం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిడిపిఒ రాజేశ్వరి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో మైలవరం మండలంలోని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్కు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం భాగంగా శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ జి.మహేష్, సూపర్వైజర్లు సునీత, హేమలత, వెంకటలక్ష్మి, బిపిసి రమేష్, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

చాపాడు : ఆడపిల్లలను రక్షించి, చదివించి అన్ని రంగాల్లో రాణించేలా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసిడిఎస్ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారి సావిత్రి తెలిపారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరునెలలు మందులు వాడితే క్షయ నయం

ఎర్రగుంట్ల : రోగి ఆరు నెలలపాటు మందులు వాడితే క్షయ వ్యాధి నయమవుతుందని వైద్యులు సూచించారు. మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో శనివారం క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వివేకానంద పాఠశాల విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, శరీరం బరువు తగ్గుట వంటి లక్షణాల ద్వారా క్షయ వ్యాధిని గుర్తించవచ్చని తెలిపారు. ఆయా లక్షణాలు కలిగిన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం రూ.500అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి, హెల్త్ సూపర్వైజర్ సుభద్ర, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

28 నుంచి శివాలయంలో సంప్రోక్షణ

చక్రాయపేట : గండి క్షేత్రంలోని పడమర దిక్కున వెలసిన శివాలయంలో ఈనెల 28 నుంచి సంప్రోక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు శ్రీ యోగి రామానంద స్వామి చరణ సేవా ట్రస్టు నిర్వాహకులు సదాశివరెడ్డి, దండపాణి తెలిపారు. శనివారం శివాలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ట్రస్టు సభ్యులు శ్రీహరి స్వామి మాట్లాడుతూ ఈనెల 28న గురువారం ఉదయం పలు పూజా కార్యక్రమాలు, 29న అమ్మవారి ఖడ్గమాల, చండీ సప్తశతి పారాయణం, లలిత సహస్రనామ కుంకుమార్చనలు, 30న అగ్నిప్రతిష్ఠ, హోమాలు ఉంటాయన్నారు. భక్తులకు అన్నప్రసాద వినియోగ కార్యక్రమం ఏర్పాటు చేసామన్నారు. కార్యక్రమంలో సేవా ట్రస్టు కార్యదర్శి కిరణ్ కుమార్, సహాయ కార్యదర్శి కావలి హరినాథ్, సభ్యులు కావలి క్రిష్ణతేజ, సత్యనారాయణ, అపరాజిత, శ్రావణి, అష్రఫ్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రతి శనివారం అన్నదానం

చక్రాయపేట : అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అనుచందంగా మండలంలో నాగలగట్టుపల్లి దేవరగుట్టపల్లి మధ్యలో ఉన్న దశరథ మహారాజు ఆలయం వద్ద దాతలు ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తూ వస్తున్నారు. నేటికీ 150 శనివారాలు పూర్తయ్యాయి. కార్యక్రమంలో కొప్పుల్లోళ్లపల్లె బయ్యారెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దశరథ మహారాజు స్వామి ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి

ఎరువుల దుకాణాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు ఉండరాదు

ముద్దనూరు : ఎన్నికల నియమావళిని దృష్టిలో పెట్టుకుని ఎరువుల దుకాణాల్లో రాజకీయ నాయకులు ఫొటోలు, బ్యానర్లు ఉండకూడదని ఎఒ, క్వాలిటీ కంట్రోల్ ఇన్స్పెక్టర్ వెంకటక్రిష్ణారెడ్డి డీలర్లకు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ఎఒ మండలంలోని ఇన్పుట్స్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో ఎరువుల బస్తాలపై, రాజకీయ నాయకుల ఫొటోలు, బ్యానర్లు, గోడ పత్రాలు ఉండకూడదన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించి వ్యాపార లావాదేవీలు కొనసాగించాలన్నారు. లైసెన్స్ కనపడేలా దుకాణంలో ఉంచాలని, బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా రాసి ఉంచుకోవాలన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు నగదు బిల్లు ఇవ్వాలని సూచించారు. అనుమతి పొందిన వాటిని మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. స్టాక్ బోర్డ్, ధరల పట్టిక రోజూ అప్డేట్ చేసి పెట్టుకోవాలన్నారు.

పేదలను ఆదరించాలి

ప్రొద్దుటూరు : పేదలను ఆదరించి వారి కనీస అవసరాలు తీర్చాలని ప్రాణదాత సేవాసమితి కార్యదర్శి రాజు అన్నారు. వేసవికాలం అయినందున ఎండలు తీవ్రంగా ఉన్నాయి. శనివారం సమితి ఆధ్వర్యంలో పేదలకు పాదరక్షలతోపాటు అన్నదానం చేశారు. గుత్తి వరుణ్తేజ్, వైష్ణవి పుట్టినరోజు సందర్భంగా అమ్మనాన్నలు ఆనంద్కుమార్, లక్ష్మిదేవి సహకారంతో సేవా కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, శారీరక శ్రమ చేయలేనివారిని గుర్తించి సేవలందించాలని ఆయన కోరారు.

లాడ్జిలో ఉపాధ్యాయుడు ఆత్మహత్య

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరు పట్టణంలోని ఓ లాడ్జిలో కర్నూలు జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కర్నూలు పట్టణంలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు రాజశేఖర్ శర్మ కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలంలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం ఎంఇఒ ఉపాధ్యాయుడ్ని సస్పెండ్ చేయడంతో మనస్థాపానికి గురైన ఉపాధ్యాయుడు రెండు రోజుల క్రితం ప్రొద్దుటూరుకు వచ్చారని, ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకొని చేతికి ఉన్న నరాలను కోసుకొని సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోలీసులు విచారిస్తున్నారు.

సెంట్రల్‌బోలె వార్డులో తాగుబోతు హల్‌చల్

విద్యుద్దీపాలు, పూల మొక్కలు ధ్వంసం.. పరిశీలించిన పోలీసు, మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ మెయిన్ రోడ్‌లో నూతనంగా సెంట్రల్ బోలే వార్డుని సుందరీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు ఖర్చు చేసింది. శుక్రవారం రాత్రి మద్యం తాగిన ఒక అగంతకుడు సెంట్రల్ బోలే వార్డుకు వచ్చి విచక్షణా రహితంగా అక్కడ ఏర్పాటు చేసిన 9 బొల్లార్డ్ లైట్స్‌ను పగలగొట్టి, అక్కడే ఏర్పాటు చేసిన పూలమొక్కలను పెకిలించాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సీఐ శంకర్‌రెడ్డి , టీపిఓ, ఎంఇఇ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శనివారం సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆ అగంతకుడిని గుర్తించి తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో కూడా బ్లూ కోర్ట్ పోలీస్ వారితో ప్రత్యేక నిఘా ఉంచాలని సీఐని కోరారు. రోడ్డులో సిసి కెమెరాలు అమర్చడానికి తగు చర్యలు చేపట్టవలసినదిగా మున్సిపల్ ఇంజనీర్‌కు ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. ప్రతి షాపు యజమానులు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తూ పోలీసు కూడా ఈ విషయంలో సూచించాలన్నారు. షాప్‌ల ముందు ఏర్పాటు చేసిన లైట్స్, బెంచీలు, పూల మొక్కలను ఎవరు పాడు చేయకుండా చూసుకునే బాధ్యత తీసుకోవాలని, షాపు యజమానులు ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయడం, ఉమ్మివేయడం చేయరాదని తెలి పారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించినా, వాహణదారులు ఫుట్‌పాత్‌ల పైన వాహనాలను నిలిపిన కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్ముందు ఎవరైనా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే వెంటనే మున్సిపల్ అధి కారులు, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. అనంతరం సెంట్రల్ బోలే వార్డులో జరిగిన సంఘటనకు సంబంధించిన మొత్తం నష్టాన్ని వారి నుండే రాబట్టేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విరిగిన విద్యుద్దీపాలను పరిశీలిస్తున్న కమిషనర్, సిఐ

భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి


నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నంద్యాల తులసీశ్వర్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 93వ వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక బలిజ కాలేజీలో చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. నేడు మనం అమర వీరుల స్ఫూర్తితో కడప ఉక్కు కర్మాగారం, విభజన హామీలు, ప్రత్యేక హోదా కోసం, అందరికీ విద్య-అందరికీ ఉపాధి కోసం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సూరి, రాఘవ, ఇసాక్, మటన్, విష్ణు తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

తులసిరెడ్డి నివాళులు

వేంపల్లె : అమర వీరులు సర్దార్ భగత్‌సింగ్, షాహిద్ రాజ్‌గురు, షాహిద్ సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా శనివారం వేంపల్లెలో వారి చిత్ర పటాలకు తులసిరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, ధ్రువకుమార్‌రెడ్డి, రాజా, బాలం సుబ్బరాయుడు, వెంకటేష్, అమర్‌నాథ్‌రెడ్డి, మాస్, చెన్నకేశవ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్లాస్టిక్ వాడకంపై అవగాహన అవసరమని లేపాక్షి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ, జీవరాసులు, ప్రజలపై కలిగే నష్టాలను లేపాక్షి డిగ్రీ కళాశాల విద్యార్థులు గోపవరం పంచాయతీ భగత్‌సింగ్ కాలనీలో అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రతి ఇంట్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకం కూడా ఎక్కువై పోయిందన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ఏర్పాడే దుష్ప్రమాణాలను ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిత్యం చెబుతున్నా, నిషేధం అమలు మాత్రం ఆచరణలోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ సేవా పథకం యూనిట్-2 పిఒ పుల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు వైఎస్ కుటుంబ సభ్యులకు రుణపడి ఉంటారు

పులివెందుల రూరల్ : ఆర్యవైశ్యులు వైఎస్ కుటుంబ సభ్యులకు రుణపడి ఉంటారని, ఎన్నో తరాలుగా ఆర్యవైశ్యులు వారినే నమ్ముకొని జీవిస్తున్నామని, తమకు ఏ కష్టం వచ్చినా పిలిస్తే చిన్నపిల్లల్లా మా వెనకబడి వచ్చేవారు వైఎస్ కుటుంబీకులే అని జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొత్త రవికుమార్, ట్రెజరర్ గంగాధర, వాసవి క్లబ్ అధ్యక్షుడు మహేంద్ర, జిల్లా వాసవి క్లబ్ కో-ఆర్డినేటర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి నాయకులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూధన్‌రెడ్డి ఆర్యవైశ్యులకు ఇంతవరకు ఏమీ పద వులు ఇవ్వలేదని అనడం హాస్యాస్పదమన్నారు. 2వ వార్డు కౌన్సిలర్ మిట్ట గంగాలక్ష్మికి ఇవ్వడం మీకు కనిపించలేదా అన్నారు. మార్కెట్ యార్డులో ఆర్యవైశ్యులకు పదవులు ఇచ్చిన సంగతి తెలియదా అని తెలియకుంటే తెలుసుకొని మాట్లాడాలని వారన్నారు. గండి ఆంజనేయస్వామి దేవస్థానంలో పులివెందుల ఆర్యవైశ్యులకు కూడా పదవులు ఇచ్చిన ఘనత వైఎస్ కుటుంబీకులదే అన్నారు. సెంటర్ బోలె వార్డులో ఒకప్పుడు ఇంటి ముందర ఉన్న మెటుకులు ఎక్కాలంటే చాలా ఇబ్బందిగా ఉండేదని, సెంటర్ బోలో వార్డు వేయడంతో ఇంటిలోకి వెళ్లేందుకు కూడా చాలా సులభతరం అయిందని ఆర్యవైశ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వాసవి ఫంక్షన్ హాల్ ప్రహరీకి దాదాపు కోటి రూపాయలు పైన ఇచ్చారన్నారు. ప్రత్యేకంగా పులివెందులకు ఆర్యవైశ్య కాలనీ కట్టించి, అక్కడ లక్ష్మీనరసింహస్వామి గుడిని కూడా నిర్మించారన్నారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు ఎన్నో పదవులు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.


మాట్లాడుతున్న ఆర్యవైశ్యులు

25 శాతం సీట్లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆంధ్రప్రదేశ్ విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా 25శాతం సీట్లు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పవి ఎన్‌జీఓ ఫౌండర్ ప్రవీణ్ కుమార్ కోరారు. శనివారం ఆయన కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 12.1.సి ప్రకారం రాష్ట్ర విద్యాశాఖ పోర్టల్‌లో ఆధార్ కార్డు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి, ప్రభుత్వం కౌన్సిలింగ్ పద్ధతి ద్వారా ఈ సీట్లను కేటాయిస్తుందన్నారు. ఒకటవ తరగతిలో అడ్మిషన్ పొందే 5-6 సంవత్సరాల పిల్లలకు ఈ అవకాశం అందుబాటులో ఉంటుందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఇండస్ అక్షన్ అనే స్వచ్ఛంద సంస్థ గత పది సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆ సంస్థ ఈ సంవత్సరం వారి కార్యక్రమాలు మన జిల్లా వాస్తవ్యులైన పవి ఎన్జీఓ సంస్థ ద్వారా సహకారాన్ని కోరిందన్నారు. గత పది రోజులుగా పవి ఎన్జీఓ సభ్యులు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ ప్రత్యేకమైన అవకాశాన్ని గురించి సోషల్ మీడియా ద్వారా, గృహ సందర్శనల ద్వారా, కరపత్రాలు పంచడం ద్వారా అవగాహన కలిగిస్తున్నామన్నారు. ఈ అవకాశం కోసం 040-45208001 అనే నెంబర్‌కు మిస్సిడ్ కాల్ ఇవ్వడం ద్వారా అవసరమైన సహాయాన్ని పొందవచ్చన్నారు. 2024-2025 విద్యా సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 90 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయని, అర్హతగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తులసిరెడ్డిని కలిసిన ఇర్ఫాన్‌బాషా

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ సికిలిగిరి ఇర్ఫాన్‌బాషా శనివారం పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డిని కలిశారు. తులసిరెడ్డి ఇంటిలో మంతనాలు చేశారు. అసమ్మతి నేతగా పేరుబడ్డ ఇర్ఫాన్‌బాషా తులసిరెడ్డిని కలవడం ప్రాధాన్యతను సంతరించుకొంది. కొద్దిరోజుల క్రితం రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యే రాచమల్లుకు సహకరించబోనని ఆయన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం తులసిరెడ్డిని కలవడంతో పార్టీ మారే ఆలోచనలో ఉన్నారా అని చర్చ ఉంది.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

టిడిపి అభ్యర్థులు, ఇన్‌ఛార్జిలు గెలుపే లక్ష్యంగా పని చేయాలని టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. శనివారం విజయవాడలో జరిగిన టిడిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు, ఇన్‌ఛార్జిల వర్క్‌షాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వైసిపి పాలనకు అంతం పలకాలని అందరం కలిసికట్టుగా పని చేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారన్నారు. కార్యక్రమంలో జిల్లా నుంచి జమ్మలమడుగు భూపేష్ సుబ్బరామిరెడ్డితోపాటు రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, ప్రొద్దుటూరు వరదరాజులరెడ్డి, పులివెందుల బిటెక్ రవీంద్రారెడ్డి ఉన్నారు.


విజయవాడలో జిల్లా టిడిపి నేతలు

వైసిపికి కామిశెట్టి బాబు రాజీనామా

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు వైసిపి పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు రాజీనామా చేశారు. ఆ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబును శనివారం కలిసి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. తన వ్యక్తిగత కారణాల వల్ల పట్టణ అధ్యక్ష పదవితోపాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు పత్రంలో పొందుపరిచారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డికి అధిష్ఠానం ప్రకటించడంతో ఆయన టిడిపి తీర్థం పుచ్చుకోబోతున్నట్లు సమాచారం. త్వరలో వరదతో చర్చలు జరిపి చంద్రబాబు ప్రొద్దుటూరుకు వచ్చిన సందర్భంగా ఆయన సమక్షంలో టిడిపి కండువా కప్పుకోబోతున్నట్లు తెలిసింది.

వైసిపిలో చేరిన వసుంధర

ప్రొద్దుటూరు : గత మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో టిడిపి కౌన్సిల్ అభ్యర్థిగా పోటీ చేసిన వసుంధర శనివారం వైసిపిలో చేరారు. వసుంధర గత కౌన్సిల్ ఎన్నికల్లో 26వ వార్డు నుండి పోటీ చేసి ఎమ్మెల్యే రాచమల్లు సతీమణి రాచమల్లు రమాదేవి చేతిలో ఓటమి చెందారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి సమక్షంలో శనివారం ఆమె వైసిపి కండువా వేసుకున్నారు. ఆ సందర్భంగా వసుంధర మాట్లాడుతూ టిడిపిలో తనకు అన్యాయం జరిగిందన్నారు. ఈ సారి రాచమల్లు గెలుపునకు తన శక్తి వంచనలేకుండా కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ వసుంధర, ఆమె భర్త అశ్వర్థరెడ్డికి స్వాగతం పలికారు. తమకున్న బంధుత్వం, సాన్నిహిత్యం రీత్యా వైసిపిలో చేరారన్నారు. వార్డు ఇన్‌ఛార్జి పాలగిరి బాషా నేతృత్వంలో ఈ వార్డు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

ఆత్మీయుల సలహా మేరకు నడుచుకుంటా

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : కొత్తపల్లి పంచాయతీలో జరుగుతున్న పరిణామాలు, మీ అందరికీ తెలుసని, అందరి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశానని, మీ సలహా మేరకు నడుచుకుంటానని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కె.శివ చంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కొనిరెడ్డి ఆయిల్ మిల్‌లో శనివారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఐదవ వార్డు కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపిలో క్రమశిక్షణ వ్యక్తులుగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎమ్మెల్యే నాయకులను అణగదొక్కాలని చూస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లుకు టికెట్ ఇవ్వొద్దంటూ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడిన ఫలితం లేదన్నారు. కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా మాట్లాడారు. మండల కౌన్సిలు మెట్టపల్లి లక్ష్మిరెడ్డి, ఎంపీటీసీ సౌభాగ్యమ్మ, వార్డు సభ్యులు ఇస్మాయిల్, రమణారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, వివి నగర్ సుమంత్, తళ్లమ్మపురం గిరి పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాల్లో కవాతు

ఎర్రగుంట్ల : మాలెపాడు, కలమల్ల, ఇల్లూరు, చిన్న దండ్లూరు గ్రామాల్లో కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి శనివారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా సహకరించాలని సూచించారు.